మరమ్మతు చేయరు.. ఇబ్బందులు తీరవు

- అధ్వానంగా కనపర్తి–వీణవంక గ్రామాల మధ్య రోడ్డు
- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- బేతిగల్–కనపర్తి గ్రామాల మధ్య అదే పరిస్థితి
- అటకెక్కిన బ్రిడ్జి ప్రతిపాదనలు


బేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు (ఇన్‌సెట్లో) వర్షాలకు తెగిన కనపర్తి రోడ్డు

వీణవంక: అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యంతో రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదు. రెండేళ్ల క్రితం తెగిన రోడ్డుకు ఇంతవరకు మోక్షం కలగడంలేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నా శాశ్వత పరిష్కారం లేక ప్రయాణికులు, గ్రామస్తులు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కనపర్తి గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కల్వర్టు వద్ద సుమారు 100 మీటర్ల మేర రోడ్డు తెగింది. దారి మీదుగా బేతిగల్, కనపర్తి గ్రామాల ప్రజలు నిత్యం వెళ్లుతుంటారు. రోడ్డు తెగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే ఎగువ నుంచి వచ్చే వరద సులువుగా దిగువకు వెళ్లే అవకాశం ఉంది. ఇందు కోసం నిధులు కూడా గత ప్రభుత్వం కేటాయించింది. కానీ ఇప్పటి వరకు వంతెన నిర్మాణానికి నోచుకోవడం లేదు.

ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి

బేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల దూరం. బేతిగల్ ఊర చెరువు నుంచి వచ్చిన వరదకు నాలుగుచోట్ల రోడ్డు దెబ్బతింది. కనీసం కారు కూడా వెళ్లని దుస్థితి నెలకొంది. అదేవిధంగా బేతిగల్-జమ్మికుంట ప్రధాన రోడ్డుపై ఊర చెరువు మత్తడి వద్ద నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థలోకి చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. కల్వర్టు నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం అధికారులు ప్రతిపాదనలు పంపిన ఇంతర వరకు మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని కనపర్తిలో వంతెన నిర్మాణంతో పాటు బేతిగల్‌లో కల్వర్టు నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి

కనపర్తి నుంచి వీణవంకకు వెళ్లే దారి వర్షాలకు తెగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఇంత వరకు మరమ్మతు చేయలేదు. ఇక్కడ వంతెన నిర్మిస్తే ఎగువ నుంచి వచ్చే వరద దిగువనకు సులువుగా వెళ్తుంది. ఈ సమస్యను గతంలో అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. నిత్యం మండల కేంద్రానికి బేతిగల్, కనపర్తి గ్రామాల ప్రజలు ఈ దారి మీదుగానే వెళ్తుంటారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలి. అదేవిధంగా బేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య రోడ్డుకు మరమ్మతు చేయించాలి.

–శ్రీనివాస్‌రెడ్డి, కనపర్తి



జమ్మికుంట: పట్టణంలోని బాలికల పాఠశాల సమీపంలోని కూడలి వద్ద మ్యాన్‌హోల్‌పైకప్పు శిథిలమై ప్రమాదకరంగా ఉంది. మున్సిపల్ అధికారులు భారీకేడ్ పెట్టారు కానీ మరమ్మతు చేయడం లేదని, రాత్రివేళ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, ఇకనైనా సంబంధిత అధికారులు మరమ్మతు చేయాలని నాయకులు, కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎండీ అయాజ్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 89787 78080

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227


జమ్మికుంట: 1984-85 పదోతరగతి విద్యార్థులు


జమ్మికుంట:1983-84 పదోతరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హుజూరాబాద్/జమ్మికుంట/చిగురుమామిడి: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1983–84, 1984–85, కాకతీయ హైస్కూల్, హుజూరాబాద్ పట్టణంలోని విశ్వప్రగతి 1999–2000, చిగురుమామిడి మండలం ఇందుర్తి 1982–83 పదో తరగతి విద్యార్థులు వేర్వేరుగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఇందుర్తి పూర్వ విద్యార్థి సదాశివ పాఠశాలకు రూ.యాభైవేలు విలువ చేసే సౌండ్ సిస్టం బహూకరించారు.


చిగురుమామిడి: ఆత్మీయ సమ్మేళనంలో ఇందుర్తి 1982-83 పదో తరగతి విద్యార్థులు

జంగపల్లిలో పోచమ్మ బోనాలు



గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలోని శ్రీభక్తమార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో గ్రామ వీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు లింగయ్య, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం

చిగురుమామిడి: కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల మహిళా అధ్యక్షురాలిగా పోలు స్వప్న రెండోసారి నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేసినందుకు రెండోసారి నియమించారని, సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డికి స్వప్న కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కరీంనగర్ జిల్లా వైస్‌చైర్మన్‌గా రాకేశ్


నియామకపత్రం అందుకుంటున్న రాకేశ్

హుజూరాబాద్/జమ్మికుంట: వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్‌గా హుజూరాబాద్‌కు చెందిన గాలి రాకేశ్‌ను నియమిస్తున్నామని వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ ఫౌండర్ డా.నలమాస శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందించారు. హన్మకొండలో జరిగిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. వినియోగదారుడిని మేల్కొలిపే దిశగా పని చేయాలని, ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు రాకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ శ్రీకాంత్‌గౌడ్ నియామకపత్రం ఆదివారం అందజేశారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల పక్షాన పనిచేస్తానని నియమకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏక్ మినార్ మజీద్ అధ్యక్షుడిగా మహ్మద్ జలాలుద్దీన్ అక్బర్

హుజూరాబాద్: ఏక్ మినార్ మజీద్ అధ్యక్షుడిగా మహ్మద్ జలాలుద్దీన్ అక్బర్ ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హుజూరాబాద్ జామ మసీద్ ఈద్గా, కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యదర్శిగా ఎండీ హుస్సేన్, కోశాధికారిగా నవాఖాన్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అంకూశ్, హైమత్‌ఖాన్, హుస్సేన్, మీర్జా అఫ్జల్, రామీజ్ అహ్మద్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కల్వర్టు నిర్మించాలని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామ శివారు కుక్కరకుంట పరిధిలోని కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. మరమ్మతు కోసం తాత్కాలికంగా రోడ్డుపక్కన ఉన్న వ్యవసాయభూమిలో నుంచి దారి ఏర్పాటు చేశారు. కల్వర్టు కోసం నిధులు మంజూరైన నిర్మించడం లేదని కొందరు రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. వాహనాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. వాహనాల కారణంగా దుమ్ము లేస్తుందని, పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

వీణవంక: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడాలపల్లి, గంగారం, బొంతుపల్లి గ్రామాలలో గ్రామ కమిటీలను నియమించారు. మామిడాలపల్లి గ్రామ అధ్యక్షుడిగా వంతెన లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శిగా శీలం తిరుపతిరెడ్డి, గంగారం గ్రామ అధ్యక్షుడిగా గూడెపు కోమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పొన్నాల శ్రీనివాస్, బొంతుపల్లి గ్రామ అధ్యక్షుడిగా జున్నూతుల కోమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి రమేశ్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ మెంబర్ కర్ర భగవాన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల శ్యాం సుందర్‌రెడ్డి, ఎండీ సాహెబ్‌హుస్సేన్, ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

రామడుగు: న్యూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆదివారం మండలంలోని వెలిచాలలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కాడె నర్సింగం, గర్వందల నవీన్, వీర్ల రాంచెందర్ రావు, రేగూరి దిలీప్, సాగర్, నితీష్, శ్రీకాంత్, లింగం, మల్లేశం పలువురు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్


కృష్ణ, శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా బెజ్జంకి, గన్నేరువరం ఉమ్మడి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు. అనివార్యకారణాలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాకలేకపోయారని, ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం స్టీల్ రెయిలింగ్ పనులను సొంత ఖర్చులతో ఎమ్మెల్యే, శ్రీనివాస్‌రావు కలిసి 20న ప్రారంభిస్తారని హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, శ్రీనివాస్‌రావును సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బద్దం తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ అలువాల కోటి, పాలకవర్గసభ్యులు పోతు రాజమల్లు, చెక్కిళ్ల మల్లయ్య, ఎల్లాల ముత్యంరెడ్డి, పీచు మల్లారెడ్డి, చెన్నాడి మధు, వర్కోలు భిక్షపతి పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తాచాటాలి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారకభవనంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి జిల్లా కౌన్సిల్ సభ్యుడు చిన్నస్వామి అధ్యక్షత వహించారు. జిల్లాలో అత్యధిక ఎంపీటీసీ స్థానాలతో పాటు రెండు నుంచి మూడు జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని, కార్యకర్తలు కష్టపడాలని, అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలన్నారు. జీపీ ఎన్నికల్లో సీపీఐ బలోపేతం దిశగా సభ్యత్వ నమోదు పూర్తిచేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ.. మండలంలో ఎర్రజెండా ఎగురవేయాల ని, కార్యకర్తలు కష్టపడితేనే సాధ్యమన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులుస్వామి, అశోక్, మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు రాజయ్య,శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు బాపురెడ్డి, జయ్‌పాల్‌రెడ్డి, రాజయ్య, బోయిని పటేల్, కొంరయ్య పాల్గొన్నారు.

పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ కూడి వద్ద పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించిన రోజును పురస్కరించుకొని ఆదివారం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు వీరభద్రరావు, వెంకట్‌రెడ్డి, మనోజ్, విద్యాసాగర్, రత్నం, రాజిరెడ్డి, శివాజీ, సంపత్‌రావు, ప్రభాకర్, స్వామి, రాజమౌళి, గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



గంగాధర: ఏపీలోని విశాఖపట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రెండో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని మైనారిటీ గురుకుల విద్యాలయ విద్యార్థిని లగిశెట్టి శరణ్య బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. అండర్– 14 బాలికల విభాగంలో 35 కేజీ స్పారింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో బంగారు పతకం, 40కిలోల కటాస్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన విద్యార్థినిని పలువురు అభినందించారు.

సన్మానం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన తిప్పారపు లక్ష్మీనర్సయాచార్యులు రచించిన శ్రీరమణశతకం పుస్తకావిష్కరణ పురస్కరించుకొని ఆదివారం గ్రామంలోని సమ్మునిత సహాయ సమితి గ్రూప్ సభ్యులకు రచయిత పుస్తకాలు అందజేశారు. అనంతరం రచయితను గ్రూప్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎల్ఐసీ శాఖ మేనేజర్ భీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, గ్రూప్ అధ్యక్షుడు గాజుల ఆనందంతో పాటు సభ్యులు దేవదాసు, పవన్, కొంరారెడ్డి, లక్ష్మీకాంతం, రవీందర్, లక్ష్మీపతి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: ఉద్యోగ విరమణ పొందిన పట్టణ కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు ఉడుత శంకరయ్యను రామకృష్ణ సేవా సమితి, చొప్పదండి లయన్స్ క్లబ్, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు. సమావేశంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు చెట్ల రాంకిషన్, మహేశుని మల్లేశం, కొల్లూరి ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది


బహుమతులు అందజేస్తున్న వొడితెల ప్రణవ్

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆర్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. గెలుపొందిన కరీంనగర్, రన్నర్ హుజూరాబాద్ జట్లకు కప్పులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తోంది'

జమ్మికుంట: కులగణనలో బీసీలు తక్కువ శాతం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై అనుమానాలున్నాయని, గత సమగ్ర సర్వేలో ఉన్న జనాభా కంటే తగ్గించి చూపడం బీసీలను రాజకీయంగా అణిచివేయాలనే కుట్రలో భాగమేనని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరాస్వామిగౌడ్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. పదేళ్లలో బీసీ జనాభా 5 శాతం పెరిగితే, అగ్రకుల జనాభా 2శాతం పెరిగినట్లు తప్పుడు సర్వేలు చూపి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కాపాడడం కోసం బీసీలను బలిపశువు చేస్తున్నారని, ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా హడావిడిగా అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వంపై నిందవేసి తప్పించుకోవాలని చూస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయని పక్షంలో కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీసీల కోసం కొత్త నాయకత్వం రావాల్సి ఉందన్నారు.

కొమురయ్య గెలుపునకు కృషి చేయాలి

గన్నేరువరం: కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపునకు సీపీఎస్ ఉద్యోగులు కృషి చేయాలని తపస్(తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం)టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రశాఖ ఏకగ్రీవ తీర్మానంలో కొమురయ్యకు మద్దతు ప్రకటించామని, కొమురయ్య గెలుపును ఎవరూ ఆపలేరని దీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కల్గిన వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కొమురయ్యకు మద్దతుగా సీపీఎస్ ఉద్యోగులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని తెలిపారు.

వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: వాట్సాప్‌లో దుష్ప్రచారం చేసిన విషయంపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. బల్మూరి వెంకట్ ఫ్యాన్స్ అనే వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి, డీపీలో బల్మూరి వెంకట్ ఫొటో పెట్టి ఓ కాంగ్రెస్ నేతకు సంబంధించిన సమాచారాన్ని దుష్ప్రచారం చేస్తూ ఎమ్మెల్సీ బల్మూరిని బదనాం చేస్తున్నారని, వాట్సాప్ గ్రూపు కియేట్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని హనుమండపల్లికి చెందిన పనకిల శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలి

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి వాగు నుంచి గ్రామానికి చెందిన ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. భూగర్భజలాలు అడుగంటి పోతాయని రైతులు మూడు రోజుల క్రితం ఇసుక తరలింపును అడ్డుకోగా ఆదివారం నుంచి మళ్లీ తరలిస్తున్నారని, మానకొండూర్ మండలం గంగిపల్లి, కొండపల్కలలో సిమెంట్ బ్రిక్స్‌కు తరలిస్తున్నారని, అధికారులు స్పందించి వాగు నుంచి ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తా

హుజూరాబాద్: పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఉంటారని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సభకు ముఖ్య అతిథిగా నరేందర్‌రెడ్డి హాజరుకాగా ప్రణవ్ మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని నరేందర్‌రెడ్డి అనానరు. అత్యధిక మెజార్టీతో గెలపించాలని కోరారు. సింగాపూర్‌లో ప్రణవ్ వివాహ దినోత్సవం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ విజయానికి కృషి చేస్తానని ప్రణవ్ హామీ ఇచ్చారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి, సాగర్ తదితరులు ఉన్నారు.